ప్రత్యక్ష సాక్షి

RNI No.APTEL/2011/38267

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ప్రత్యక్ష సాక్షి దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ ప్రాంతంలోని అన్ని జిల్లాలు మరియు నియోజకవర్గాల నుంచి పనిచేయటకు విలేకరులు కావలెను. ప్రశ్నించే తత్వంతో పాటు నిజాన్ని నిర్భయంగా రాయగలిగే సత్తా ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి : సెల్ : 99892 88546

సంపుటి : 16 సంచిక : 107 శనివారం 07-11-2026

ఎడిటర్ : కందుకూరి పరమేశ్వర్‌రావు, M.A. పేజీలు : 4 వెల : రూ2/-

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలి : మంత్రి అడ్లూరి



కుమారస్వామి ప్రత్యక్ష సాక్షి స్టాప్ రిపోర్టర్ జగిత్యాల

తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాలైన ధర్మపురి శ్రీ ఉగ్ర నరసింహ స్వామి వారి దేవస్థానం మరియు కోటిలింగాల శ్రీ కోటేశ్వర స్వామి వారి దేవస్థానాల పునర్నిర్మాణ పనులు, అలాగే రానున్న పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పనపై రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఎండోమెంట్ కమిషనర్ హనుమంత రావు గారు జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ గారు మరియు సంబంధిత అధికారులతో కలిసి సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ధర్మపురి మరియు కోటిలింగాల పుణ్యక్షేత్రాల ప్రాముఖ్యత, ఆలయాల పునర్నిర్మాణానికి సంబంధించిన అంశాలు, భక్తులకు అవసరమైన సౌకర్యాలు, రానున్న పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి క్షేత్రం, కోటిలింగాల శ్రీ కోటేశ్వర స్వామి వారి క్షేత్రాలు తెలంగాణ రాష్ట్రంలో ఎంతో చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన పుణ్యక్షేత్రాలని పేర్కొన్నారు. ఈ ప్రాంతాలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారని, అందుకు అనుగుణంగా ఆలయాల అభివృద్ధి, పునర్నిర్మాణ పనులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.

ఆలయాల పునర్నిర్మాణంపై ప్రత్యేక దృష్టి.. ధర్మపురి ఉగ్ర నరసింహ స్వామి వారి దేవాలయం మరియు కోటిలింగాల కోటేశ్వర స్వామి వారి దేవాలయాల పునర్నిర్మాణ పనులను సమగ్ర ప్రణాళికతో చేపట్టాలని మంత్రి సూచించారు. ఆలయాల ప్రాచీనత, చారిత్రక ప్రాధాన్యత, సంప్రదాయాలు, ఆగమ శాస్త్ర నియమాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులకు తెలిపారు.

పుష్కరాల ఏర్పాట్లపై సమీక్ష.. రానున్న పుష్కరాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, విద్యుత్, వైద్య సదుపాయాలు, పార్కింగ్, రవాణా సౌకర్యాలు, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు తెలిపారు.

పుష్కరాల సమయంలో భక్తుల రద్దీని సమర్థవంతంగా నియంత్రించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని,ఘాట్ల అభివృద్ధి, స్నానాల కోసం సురక్షితమైన ఏర్పాట్లు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ధర్మపురి మరియు కోటిలింగాల పుణ్యక్షేత్రాల అభివృద్ధితో పాటు పుష్కరాల ఏర్పాట్లను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని, సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచించారు. భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా ప్రభుత్వం తరపున అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు.

తెలంగాణ ప్రజలకు దీపావళి కానుక..

మెట్రో-ఆర్టీసీ నెలవారీ పాస్ ధర భారీగా తగ్గింపు..



(హైదరాబాద్)

తెలంగాణ ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం దీపావళి కానుక ప్రకటించింది. మెట్రో-ఆర్టీసీ ఉమ్మడి ప్రయాణ పాస్ ధరలను భారీగా తగ్గించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో రూ. 8500 ఉన్న నెలవారీ పాస్ ధర రూ. 4000కు తగ్గించినట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ప్రజలపై ప్రయాణ ఖర్చుల భారం తగ్గించి, ప్రజా రవాణా సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు.

"ప్రస్తుతం రూ. 400గా ఉన్న రోజువారీ ఉమ్మడి ప్రయాణ పాస్ ధరను రూ. 275కు తగ్గించాం. ఇందులో రూ. 200 మెట్రో ప్రయాణానికి, రూ. 75 ఆర్టీసీ ప్రయాణానికి కేటాయించాం. ఈ పాస్ ద్వారా రోజుకు 4 సింగిల్ జర్నీలకు అనుమతి ఉంటుంది. ప్రస్తుతం రూ. 8,500గా ఉన్న నెలవారీ ఉమ్మడి ప్రయాణ పాస్ ధరను ఏకంగా రూ. 4,000కు తగ్గించాం. ఇందులో రూ. 3,000 మెట్రో ప్రయాణానికి, రూ. 1,000 ఆర్టీసీ ప్రయాణానికి కేటాయించాం. ఈ పాస్ ద్వారా నెలలో గరిష్ఠంగా 50 రౌండ్ ట్రిప్పులకు అనుమతి ఉంటుంది.

ఈ ధరల తగ్గింపుతో నెలవారీ ఉమ్మడి ప్రయాణ పాస్ వినియోగదారులకు రూ. 4,500 ఆదా అవుతుంది. రోజువారీ ఉమ్మడి పాస్ వినియోగదారులకు రూ. 125 ఆదా అవుతుంది. ప్రభుత్వం ప్రకటించిన తగ్గింపు ధరలు నవంబర్ 8 నుంచి అమల్లోకి వస్తాయి. దీనికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత సంస్థలను ఆదేశించాం. ప్రజల సంక్షేమం, ప్రయాణికుల ఆర్థిక ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం సామాన్య ప్రజలకు ఎంతో ఊరటనిస్తుంది" అని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన డి అక్షిత రెడ్డి..



ప్రత్యక్ష సాక్షి కరీంనగర్ టౌన్

క్రీడల ద్వారా విద్యార్థులకు అనేక లాభాలు జరుగు తాయని మరియు ఒత్తిడి నుండి ఉపశమనం పొందుతారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక కొత్తపల్లిలో అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠ శాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశానికి ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక రకా మైన కార్యక్రమాలను నిర్వహించడం జరుగు తుందని మరియు పోటీలను సైతం నిర్వహించడం జరుగుతుందని వారు నా ద్వారా పట్టు వస్తుందని మరియు ఆసక్తి పెరుగు తుందని ఆయన తెలిపారు. ఈ క్రమంలో డి. అక్షిత్ రెడ్డి, ఎస్ జి ఎఫ్ వాలీబాల్ చాంపియన్షిప్ అండర్ -17 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనడని చెప్పారు అని చెప్పారు. విజేతకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి జాతీయ స్థాయి పోటీలలోను అద్భుతమైన ప్రతిభను కనబరిచి ఉత్తమంగా ఉండాలని వారు చెప్పారు. రాష్ట్ర స్థాయి పోటీలలోను అద్భుతమైన ప్రతిభను కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

'భారత్ సమ్మిట్' - 2026

వంద దేశాల నుంచి ప్రతినిధులు రాక..

(హైదరాబాద్)

ప్రపంచ స్థాయి వేదికకు హైదరాబాద్ సిద్ధమవుతోంది. ఈనెల 12, 13, 14 తేదీలలో నగరంలోని ప్రసిద్ధ 'హైటెక్స్' ప్రాంగణంలో ప్రతిష్టాత్మక 'భారత్ సమ్మిట్' నిర్వహించనున్నారు. వివిధ దేశాల మధ్య సత్సంబంధాలను మరింత పెంపొందించడం, అంతర్జాతీయ సహకారాన్ని విస్తరించడమే లక్ష్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 100 దేశాల నుంచి దౌత్యవేత్తలు, ప్రతినిధులు ఈ సమ్మిట్‌కు హాజరుకానున్నారు.

ఈ అంతర్జాతీయ సదస్సు కోసం దాదాపు 450 మంది విశిష్ట అతిథులకు ప్రత్యేక ఆహ్వానాలు పంపారు. కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమ ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. ఈ సదస్సుకు కేంద్ర మంత్రులతో పాటు కాంగ్రెస్ జాతీయ నాయకుడు, పార్లమెంట్ సభ్యుడు శశి థరూర్ తదితర రాజకీయ, దౌత్య రంగాల ప్రముఖులు హాజరుకానున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సమ్మిట్లో అంతర్జాతీయ సంబంధాలు, ఆర్థిక పురోగతి, గ్లోబల్ పార్టనర్షిప్లపై కీలక చర్చలు జరగనున్నాయి.



బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం...

జీవో నంబర్ 14 రద్దు చేసే వరకు దశలవారీగా ఉద్యమిస్తాం : మాజీ చీఫ్ విప్,మాజీ ఎమ్మెల్యే దాస్యం

సాయి... ప్రత్యక్ష సాక్షి వరంగల్ బ్యూరో చీఫ్

కాంగ్రెస్ ప్రభుత్వం జీవో 14 లో మార్పు చేయడాన్ని నిరసిస్తూ... ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్, బీసీ ప్రజా సంఘాల ప్రతినిధులతో కలిసి శుక్రవారం కేయూ జంక్షన్ ఎస్డీఎస్సీ వద్ద ఉన్న మహాత్మా జ్యోతి బా పూలే విగ్రహం వద్ద పత్రికా సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ వర్గాలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీసీ నేత విమర్శించారు. బీసీల ఆత్మ గౌరవానికి సంబంధించిన భవన నిర్మాణం, సంక్షేమ పథకాల అమలు, కులవృత్తుల అభివృద్ధి విషయంలో ప్రభు త్వం నిర్లక్ష్యంగా వ్యవహరి స్తోందని ఆరోపించారు.ప్రతి సంవత్సరం బీసీ సంక్షేమానికి రూ. 20 కోట్లు కేటాయించాల్సి ఉండగా, బడ్జెట్‌లో ఎంత కేటాయించారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. బీసీ విద్యా ర్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, 42 శాతం రిజర్వేషన్లు, కాంట్రా క్టుల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీల పరిస్థితి ఏమైందని ప్రశ్నించా రు.గతంలో బీసీ కుల సంఘాల ఆత్మగౌరవ భవనాల కోసం కేటాయించిన భూములకు సంబంధించి పలు జీవోలు జారీ చేసి, చివరకు జీవో నంబర్ 14 తీసుకురావడం వెనుక ఉ ద్దేశం ఏమిటని ప్రశ్నించారు.

ఈ జీవో కారణంగా బీసీ కుల సంఘాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణా నికి ఆటంకాలు ఏర్పడుతు న్నాయని పేర్కొన్నారు.గౌడ కులస్తుల ఆరాధ్య దైవం సర్దార్ సర్వాయి పాపన్న జయంతి, ఇతర కుల సంఘాల ప్రముఖ నాయకుల జయంతి వేడుకలు నిర్వహించుకోవడానికి అవస రమైన సౌకర్యాలు కల్పించా లని కోరారు.కనీసం కార్యక్రమా లకు వచ్చే వారికి తాగునీరు, టీ, అల్పాహారం వంటి ఏర్పాట్లు కూడా చేయ లేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.గత ప్రభుత్వ హయాంలో గొల్ల, కురుమలకు



గొర్రెల పంపిణీ, మత్స్యకారుల కు చేపల పంపిణీ, బీసీలకు బీసీ బంధు వంటి పథకాల ద్వారా ఆర్థిక చేయూత అందించారని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా బీసీల ఆర్థిక అభివృద్ధికి ఎలాంటి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టలేదని విమర్శించారు.కులవృత్తులపై ఆధారపడిన వర్గాలు పోటీ ప్రపంచంలో ఉపాధి కోల్పోతు న్నాయని పేర్కొన్నారు.నేత కార్మికుల కోసం ఏర్పాటు చేసిన సహకార సంఘాలకు ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిం చారు. చెరువులపై ఆధారపడి జీవించే మత్స్యకారుల ఉపా ధిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. చెరువుల నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా వందలాది కుటుంబాలు జీవనోపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీ కుల సంఘాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి సంబం ధించిన భూముల విషయంలో ప్రభుత్వం పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 14 వెనుక పెద్ద కుట్ర ఉందని, బీసీలకు కేటాయించిన స్థలాల విషయంలో అన్యాయం జరిగే ప్రమాదం ఉందని ఆరోపిం చారు.ఈ జీవోను రద్దు చేసే వరకు బీసీ వర్గాల తరపున దశలవారీగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

జనాలపైకి దూసుకెళ్లిన లారీ..

ఏడుగురు దుర్మరణం..

తొమ్మిది మందికి గాయాలు

(జార్ఖండ్)

రోడ్డు ప్రమాదంలో ఏకంగా ఏడుగురు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన జార్ఖండ్ రాష్ట్రంలోని కుంటి (ఖష్ట్రబఙ్ఞ) జిల్లాలో చోటుచేసుకుంది. వేగంగా వచ్చిన ఓ లారీ అదుపుతప్పి జనాలపైకి దూసుకెళ్లడంతో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా, 9 మందికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. కారా పోలీసు స్టేషన్ పరిధిలోని కారా-తార్పా ప్రధాన రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున ఓ స్కూటీ ప్రమాదానికి గురైంది. ఆ ప్రమాదం గురించి తెలుసుకున్న స్థానికులు, బాటసారులు రోడ్డుపై గుమిగూడారు. ఆ సమయంలో అదే మార్గంలో అతివేగంగా వచ్చిన ఓ లారీ అక్కడున్న జనాలపైకి దూసుకెళ్లింది.

ఈ భీకర ప్రమాదంలో ఆరుగురు వ్యక్తులు సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరొకరు మృతి చెందారు. మృతులలో ముగ్గురు మహిళలు, ముగ్గురు పిల్లలు, ఒక పురుషుడు ఉన్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.



బహుముఖ ప్రజ్ఞాశాలి కమల్ హాసన్

నవంబర్ 7... సహజ నటుని జన్మదినం



కమల్ హాసన్ విశిష్ట నటుడే కాదు ఒక విచిత్రమైన వ్యక్తి, మంచి కథకుడు, స్క్రీన్ ప్లే రచయిత, నిర్మాత, దర్శకుడు... అజ్ఞాత సంగీత దర్శకుడు కూడా. తను నటించే సినిమాలో ఏదో ఒక ప్రత్యేకత వుండాలని, రొటీన్ పాత్రలకు అది భిన్నంగా వుండాలని కోరుకునే వ్యక్తి. దక్షిణభారత చలనచిత్ర పరిశ్రమ నుంచి బాలీవుడ్‌కు వెళ్లి అక్కడ కూడా తన ప్రత్యేకతను నిలుపుకున్న ఒక మంచి నటుడు. చలన చిత్రరంగానికి ఆయన ఒక 'వసూల్ రాజా'. భారతీయుడు సినిమా రెండు వందల మిలియన్లు ఆర్జించి పెట్టిన విషయం ఈ మాటను నిజం చేసింది. నవంబర్ 7, 1954న తమిళనాడులోని రామనాథపురానికి చేరువలో వున్న పరమక్కుడి పట్టణంలో జన్మించాడు. కమల్ హాసన్ అసలు పేరు పార్థసారథి శ్రీనివాసన్. తండ్రి డి.శ్రీనివాసన్ న్యాయవాద వృత్తిలో వుండేవారు. కమల్ తల్లి రాజలక్ష్మి మంచి డ్యాన్సర్. కమల్ ప్రాథమిక విద్యాభ్యాసం పరమక్కుడిలోనే జరిగింది. తరువాత వారి కుటుంబం మద్రాసులో స్థిరపడింది. మైలాపూరులోని శాంతోం పాఠశాలలో కమల్ చదువు కొనసాగింది. 1960 అక్టోబరులో కళత్తూర్ కన్నమ్మ' సినిమాలో నటించాడు. ఆ సినిమాను తెలుగులో 'మావూరి అమ్మాయి' పేరుతో అనువదించి ఆంధ్రదేశంలో విడుదల చేయగా. తొలి ప్రయత్నంలోనే ఉత్తమ బాలనటుడుగా రాష్ట్రపతి చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నాడు. కమల్ తల్లి రాజలక్ష్మి తంగప్పన్ వద్ద నాట్యం నేర్చుకుంటూ వుండేది. ఆ సమయంలోనే కమల్ చదువుకుంటూనే కొన్ని సినిమాలలో చిన్నచిన్న పాత్రలు పోషిస్తూ ఉండేవాడు. అలా తన తొలి వెండితెర పరిచయం 1970లో విడుదలైన శాండో చిన్నప్ప దేవర నిర్మించిన 'మాణవన్' చిత్రం లో కమల్ కుట్టి పద్మిని చేసే డ్యాన్స్ సన్నివేశంలో ఆమెతో కలిసి కనిపిస్తాడు. డ్యాన్స్ డైరెక్టర్ తంగప్పన్ నిర్మించి దర్శకత్వం వహించిన 'అణ్ణై వేలంకణ్ణి' సినిమాలో కాసేపు జీసస్ క్రైస్ట్‌గా కనిపిస్తాడు. కమల్ కొంతకాలం తంగప్పన్ వద్ద సహాయకుడిగా ఉంటూ డ్యాన్స్ నేర్చుకున్నారు. 1973లో ముత్తురామన్ నిర్మించిన 'కాశి యాతిరై' సినిమాలో తంగప్పన్‌కు సహాయ డ్యాన్స్ డైరెక్టర్‌గా పనిచేశాడు.

అదే సంవత్సరం కె.బాలచందర్ తొలిసారి కమల్ హసన్ చేత 'సొల్లత్తాన్ నినిక్కిరేన్' అనే సినిమాలో ఒక ప్రతినాయకుడిగా ప్లేబాయ్ పాత్రను పోషింపజేశారు. తరువాత 'అరంగేట్రం' సినిమా విజయంతో హిందీలో పునర్నిర్మించిన 'ఆయినా' సినిమాలో రాజేష్ ఖన్నాతోబాటు కమల్ కూడా నటించారు. హిందీలో అతడు నటించిన తొలి చిత్రం ఇదే కావడం విశేషం. తరువాత 1974లో తమిళంలో చాలా సహాయక పాత్రలు పోషిస్తూ వచ్చాడు. వాటిలో 'గుమస్తావిన్ మగళ్', ' 'నాన్ అవనిల్లై' సినిమాలు ముఖ్యమైనవి. సేతుమాధవన్ మలయాళంలో నిర్మించిన 'కన్యాకుమారి' సినిమాలో హీరోగా నటించే అవకాశం వచ్చింది. అందులో రీటా భాదురి హీరోయిన్‌గా నటించింది. ఈ సినిమాలో నటనకు కమల్‌కు తొలి ఫిలింఫేర్ బహుమతి లభించింది. 1975లో బాలచందర్ దర్శకత్వంలో వచ్చిన 'అపూర్వ రాగం' (తెలుగులో తూర్పు పడమర) సినిమా హీరోగా మంచి బ్రేక్ ఇచ్చింది. రజనీకాంత్ ఈ సినిమాతోనే తెరంగేట్రం చేశాడు. ఈ సినిమాకు కమల్‌కు ఇది రెండవ ఫిలింఫేర్ బహుమతి. బాలచందర్ దర్శకత్వంలో 1976లో 'మన్మధ లీలై' అనే సినిమా లో కమల్ హీరో. ఈ సినిమాతోనే జయప్రద, వై.విజయ, హేమా చౌదరి తొలిసారి వెండితెరకు పరిచయమయ్యారు. విజయవంతమైన ఈ చిత్రాన్ని తెలుగులో 'మన్మధలీల'గా, హిందీలో 'మీఠీ మీఠీ బాతే'గా 1977లో డబ్ చేశారు. ఈ చిత్రం కమల్‌కు ఒక ట్రెండ్ సెట్టర్‌గా నిలిచి అతనికి హీరోగా మంచి హోదా కలిపించింది. ఈ సినిమా తరువాత వచ్చిన ముత్తురామన్ సినిమా 'ఒరు ఊధప్పు కన్ సిముట్టిగిరదు'లో కమల్, సుజాత నటించారు. కమల్‌కు మూడవసారి ఫిలింఫేర్ బహుమతి తెచ్చిపెట్టిన చిత్రమిది. ఈ రెండు సినిమాలతో కమల్ తమిళ చిత్రరంగంలో స్థిరపడిపోయారు. తరువాత వచ్చిన మరో బాలచందర్ సినిమా 'అవర్గ' (ఇది కథ కాదు) కమల్ హాసన్ హోదాను పెంచింది. బాలచందర్ దర్శకత్వం వహించిన మరొక చిత్రం 'మూండ్రు ముడిచ్చు' (ఓ సీత కథ) కూడా మంచి హిట్టయింది. ఈ సినిమా ద్వారా శ్రీదేవి 13 ఏళ్ల ప్రాయంలో హీరోయిన్‌గా నటించింది. రజనీకాంత్ విలన్ పాత్ర పోషించాడు. భారతీరాజా దర్శకత్వం వహించిన 'పత్తినారు వయత్తినిలే' (తెలుగులో పదహారేళ్ల వయసు)లో కమల్ పోషించిన పాత్రకు ఫిలింఫేర్ అవార్డుతోబాటు తమిళనాడు రాష్ట్ర బహుమతి కూడా లభించింది. కమల్ హాసన్ కన్నడంలో బాలుమహేంద్ర నిర్మించిన 'కోకిల' సినిమాలో తొలిసారి నటించారు. అదే సంవత్సరం 'అవళ్ ఒరు తొడర్ కథై' సినిమాను 'కవిత' పేరుతో బెంగాలి భాషలో పునర్నిర్మిస్తే అందులో హీరోగా కమల్ నటించారు.

కమల్ తెలుగులో నటించిన తొలి స్ట్రెయిట్ సినిమా 'అంతులేని కథ' (1976). అప్పుడే 'మన్మధలీల' డబ్బింగ్ వర్షన్ కూడా విడుదలైంది. ఈ రెండు సినిమాలు ఆంధ్ర రాష్ట్రంలో శతదినోత్సవాలు చేసుకున్నాయి. కాగా 'మరోచరిత్ర' సినిమా రెండవ స్ట్రెయిట్ చిత్రం, . బాలచందర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని బాలచందర్ హిందీలో 'ఏక్ దూజే కేలియే' చిత్రంగా నిర్మిస్తే ఆ సినిమా రికార్డుల మీద రికార్డులు సృష్టించింది. కమల్ హీరోగా, శ్రీదేవి హీరోయిన్‌గా 'సిగప్పు రోజాక్కళ్' సినిమాలో నటనకు నాల్గవసారి ఫిలింఫేర్ బహుమతి గెలుచుకున్నారు. దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు తెలుగులో 'సొమ్మొకడిది సోకొకడిది' పేరుతో సినిమా నిర్మించారు. అందులో కమల్ ద్విపాత్రాభినయం చేయగా ఆయన సరసన జయసుధ, రోజారమణి హీరోయిన్లుగా నటించారు. ఈ సినిమా పెద్ద మ్యూజికల్ హిట్‌గా నిలిచింది. 1970 దశకంలో ఆరు ఫిలింఫేర్ అవార్డులు లభించాయి. 1981లో బాలచందర్ తెలుగులో 'ఆకలి రాజ్యం' సినిమా సూపర్ హిట్టయింది. కె.విశ్వనాథ్ దర్శకత్వంలో వచ్చిన 'సాగర సంగమం' సూపర్ డూపర్ హిట్టయింది. అదే ఊపులో వచ్చిన 'స్వాతి ముత్యం' అత్యధిక మహిళా ప్రేక్షకులను ఆకట్టుకొని విజయవంతమైంది. సింగీతం శ్రీనివాసరావు కమల్‌తో సంభాషణలు లేకుండా 'పుష్పక విమానం' చిత్రాన్ని నిర్మించారు. ఆయన ప్రయోగం సఫలమైంది. విశ్వనాథ్, బాలు కలిసి కమల్‌తో 'శుభసంకల్పం' చిత్రాన్ని నిర్మిస్తే అదికూడా శతదినోత్సవం చేసుకుంది. సింగీతం దర్శకత్వం వహించిన మరొక సినిమా 'ఇంద్రుడు చంద్రుడు'. అందులో కమల్ హసన్ ద్విపాత్రాభినయం చేశారు. 'భామనే సత్యభామనే' కూడా ఆ కోవలోనిదే. కమల్ హాసన్‌కు వైవిధ్యమైన పాత్రలు పోషించడమంటే సరదా. కళ్యాణ రామన్ చిత్రంలో ఎత్తుపళ్లతో పల్లెటూరివాని పాత్రను పోషించారు. 'రాజా పార్వై' చిత్రంలో అంధ వయోలనిస్టు పాత్రలో జీవించారు. ఈ చిత్రానికి కమల్ స్క్రీన్ ప్లే అందించడం విశేషం. 'స్వాతిముత్యం'లో మానసిక వికలాంగునిగా, 'సాగర సంగమం'లో శాస్త్రీయ నృత్యకళాకారునిగా, 'నాయకుడు' సినిమాలో అండర్ వరల్డ్ డాన్‌గా ప్రేక్షకుల మనసుల్ని దోచుకున్నారు. 'పుష్పక విమానం' సినిమాలో నిరుద్యోగ యువకునిగా, వారం రోజులపాటు భోగ భాగ్యాలు అనుభవించే అవకాశం వచ్చిన యువకునిగా నటించారు. 'విచిత్ర సోదరులు' సినిమాలో మరుగుజ్జు అవతారం ఎత్తారు. 'భామనే సత్యభామనే' చిత్రానికి శంతన్ పెనోయ్ దర్శకుడు అయినా. తనే దర్శకత్వ బాధ్యతలు స్వీకరించి సినిమాను హిట్ చేశారు. 'గుణ' చిత్రంలో కమల్‌ది అద్భుతమైన పాత్ర. ప్రేమలో పడిన ఉన్మాదిగా నటించి గొప్ప పేరు తెచ్చుకున్నారు. 'ద్రోహి' చిత్రంలో ఉగ్రవాదాన్ని అణచివేసే పోలీసు అధికారిగా కమల్ హసన్ నటన అపూర్వం. అలాగే 'భారతీయుడు' సినిమాలో స్వాతంత్ర సమరయోధుని పాత్రలో ముసలి వేషం, లంచగొండి అధికారిగా రెండవ వేషం వేసి మెప్పించారు. ఫిలింఫేర్ బహుమతులను ఏకంగా పద్దెనిమిది సార్లు గెలుచుకున్న ఏకైక నటుడు కమల్ హాసన్. కమల్ జాతీయ స్థాయిలో ఉత్తమ నటుడిగా 'మూండ్రాంపిరై' (వసంత కోకిల), 'నాయగన్' (నాయకుడు), 'ఇండియన్' (భారతీయుడు) సినిమాలో నటనకు మూడుసార్లు పురస్కారాలు అందుకున్నారు. 'సాగరసంగమం', 'స్వాతిముత్యం' తెలుగు సినిమాలు ఆసియా చలన చిత్రోత్సవాలలో బహుమతులు గెలుచుకున్నాయి. నటించిన ఆరు సినిమాలు ఆస్కార్ బహుమతి కోసం ప్రభుత్వ పక్షాన ఎంపికై, పోటీల్లో పాల్గొన్నాయి. 1990లో కేంద్ర ప్రభుత్వం కమల్‌ను పద్మశ్రీ పురస్కారంతోను, 2014లో పద్మభూషణ్ పురస్కారంతోను సత్కరించింది. తమిళనాడు ప్రభుత్వం 'కలైమామణి' బిరుదు ప్రదానం చేసింది. చెన్నైలోని సత్యభామ విశ్వవిద్యాలయం కమల్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. మొత్తం మీద కమల్ స్వీకరించిన అవార్డులు 170కి పైమాటే..

సంగన భట్ల రామకృష్ణయ్య, ధర్మపురి

మళ్లీ ప్రారంభమైన మంథని కూరగాయల మార్కెట్ పనులు..

పర్యవేక్షించిన మున్సిపల్ చైర్మన్ శ్రీ వోడ్నాల శ్రీనివాస్





టి.సత్యనారాయణ గౌడ్ ప్రత్యక్ష సాక్షి మంథని రూరల్

పెద్దపెల్లి జిల్లా మంథని మున్సిపల్ పరిధిలో ప్రజలకు, వ్యాపారస్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో చేపట్టిన కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ శ్రీ వోడ్నాల శ్రీనివాస్ మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు పెంటరి రాజు, ఎల్లంకి వంశీధర్, మరియు మున్సిపల్ అధికారులు కలిసి శుక్రవారం పర్యవేక్షించారు.

ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో మంథని పట్టణ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. అందులో భాగంగా నిర్మిస్తున్న కూరగాయల మార్కెట్ పనులు పూర్తయితే కూరగాయల వ్యాపారులకు, పట్టణ ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. మార్కెట్ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్ట్ కు మరియు అధికారులకు సూచించారు.

మార్కెట్‌లో వ్యాపారులకు, ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. మంథని పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తూ, పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని చైర్మన్ శ్రీ వోడ్నాల శ్రీనివాస్, వెల్లడించారు.లి ఈ కార్యక్రమంలో మార్కెట్కు సంబంధించిన మెయిన్ కాంట్రాక్ట్ జి శ్రీనివాస్ రెడ్డి, బృందం కూడా పాల్గొన్నారు

నిరుపేద మహిళకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు

బీర్ల మౌనిక ఇంటి నిర్మాణానికి భూమిపూజ



బుర్ర రవి ప్రత్యక్ష సాక్షి పెగడపల్లి మండలం

పెగడపల్లి మండలంలోని రాములపల్లి గ్రామానికి చెందిన నిరుపేద మహిళ బీర్ల మౌనిక కుటుంబ ఆర్థిక పరిస్థితిని, సొంత ఇల్లు లేని విషయాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై స్పందించిన మంత్రి గారు బీర్ల మౌనిక కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించారు. ప్రభుత్వం గృహ నిర్మాణ పథకం ద్వారా చేయూత అందించడంతో మౌనిక కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు సంబంధించి గురువారం రాములపల్లి గ్రామంలో భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, ఎంపీడీవో ప్రేమ్ సాగర్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారి సమక్షంలో పెగడపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కడారి తిరుపతి ముగ్గు పోసి భూమిపూజ నిర్వహించారు. నూతన ఇంటి నిర్మాణ పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా పూర్తికావాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కడారి తిరుపతి మాట్లాడుతూ, నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. బీర్ల మౌనిక కుటుంబ పరిస్థితిని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారి దృష్టికి తీసుకెళ్లగానే ఆయన సానుకూలంగా స్పందించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించడం ఆ నిరుపేద కుటుంబానికి ఎంతో ఊరటనిచ్చిందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రజాపాలన ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇందిరమ్మ ఇళ్ల మంజూరుతో నిరుపేదలకు సొంతింటి భరోసా కలుగుతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, ఎంపీడీవో ప్రేమ్ సాగర్ రావు, పెగడపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కడారి తిరుపతి, సర్పంచులు బండారి శ్రీనివాస్, రమేష్ నాయక్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు చెట్ల కిషన్, చాట్ల విజయభాస్కర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కట్ల సత్తయ్య, కట్ల శ్రీను, దీకొండ మహేందర్, నిరటి రాజేందర్ అత్తిని తిరుపతి కాంగ్రెస్ నాయకులు,కుమార్, రవి, కుమార్, రాజయ్య, మల్లేశం, కారోబార్ మల్లయ్య కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దీపావళి అంటే ఆనందం..!!

తల్లిదండ్రులు పిల్లలతో జరభద్రం : బచ్చు నాగమల్లేశ్వరరావు

ఎమ్. లక్ష్మి - ప్రత్యక్ష సాక్షి, (కూకట్ పల్లి)

దీపావళి అంటే ఆనందంతో జరుపుకునే పిల్లల పండుగగా భావించవచ్చు అన్నారు బాలాజీ నగర్ డివిజన్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ బచ్చు నాగమల్లేశ్వరరావు. ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లలు పటాసులు కాల్చేటప్పుడు దగ్గర ఉండి వారి ఆనందంతో పాల్పంచుకోవడంతో పాటు వారి భద్రత చూసుకోవాల్సిన అవశ్యకత ఉంది అని హితువు పలికారు. పిల్లలు పటాసులు కాల్చే క్రమంతో పాటు పటాసులు కొనుక్కునే క్రమంలో కూడా తల్లిదండ్రులు బాధ్యత వహించాలని సాంప్రదాయ బద్దమైన పటాసులు పిల్లలకు కొని ఇచ్చి వారికి భావితరాల భవిష్యత్తు గురించి వాయు కాలుష్యం ధ్వని కాలుష్యం లేని దీపావళి జరుపుకునే విధంగా తీర్చిదిద్దాలని ఆ విషయాలు తల్లిదండ్రులు పిల్లలకు నేర్పాలని అన్నారుదీప కాంతులకు ప్రాధాన్యత ఇవ్వాలి అందరి జీవితాల్లో వెలుగు నింపాలి అని అన్నారు. కూకట్పల్లి కాంగ్రెస్ ఇంచార్జి బండి రమేష్, బాలాజీ నగర్ అధ్యక్షులు రాజేష్ గౌడ్ తో పాటు అందరి తరుపున ప్రజలకు దీపావళి శు భాకాంక్షలు తెలిపారు బచ్చు నాగమల్లేశ్వరరావు.




ఇందిరమ్మ రాజ్యమంటే ఇంటింటా కన్నీళ్లేనా...

సమస్యలు గాలికొదిలేసి గాల్లో చక్కర్లు కొడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

టి సత్యనారాయణ గౌడ్ ప్రత్యక్ష సాక్షి మంథని రూరల్

తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ పాలన అంటే ఇంటింటా కన్నీళ్లే కనబడుతున్నాయని, ఇదేనా కాంగ్రెస్ ప్రజాపాలన అని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్,విమర్శించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో గత 25రోజులుగా తమ సమస్యల పరిష్కారం కోసం ఎన్‌హెచ్ఎంల దీక్షాశిభిరాన్ని ఆయన శుక్రవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం ఎన్‌హెచ్ఎంలు 25రోజులుగా దీక్షలు చేస్తుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నాడని ఎద్దేవా చేశారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే వైద్యసిబ్బంది దీక్షలో ఉండటంతో గ్రామాల్లో సామాన్య ప్రజలు సేవలు అందక నానా ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్‌హెచ్ఎంల దీక్షపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టిపెట్టకపోవడం, స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులు కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోవడం చూస్తుంటే మంత్రులు, ఎమ్మెల్యేలు పల్లెలకు ఎంత దూరంగా ఉంటున్నారో అర్థం అవుతుందని ఆయన అన్నారు. గల్లీలలో సమస్యలను గాలికి వదిలేసి గాల్లో చక్కర్లు కొడుతూ ఢిల్లీకి మూటలు మోస్తున్నారని ఆయన ఆరోపించారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల్లో అనేక మంది మహిళలే ఉన్నారని, వారికి కనీసం ప్రసూతి సెలవులు ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ప్రతి సమస్యను మా సమస్యగా బావిస్తామని



గొప్పలు చెప్పి ఈనాడు అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యలను పట్టించుకోవడం లేదని అన్నారు. ఎన్‌హెచ్ఎంలు చేసే సేవలను గుర్తించిన మా నాయకులు దీక్ష చేస్తున్న వారికి మద్దతు ఉండాలని తనను ఇక్కడకు తీసుకురావడం జరిగిందని, ఇది చాలా సంతోషంగా ఉందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, మంత్రులు, ఎమ్మెల్యేలు కళ్లు తెరిచి ఎన్‌హెచ్ఎంల ఈఎస్ఐ, ఈహెచ్ఎస్, ఉద్యోగ భద్రత, రెగ్యులైజేషన్‌తో పాటు వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, సమస్యలు పరిష్కారం అయ్యే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఘనంగా అమరవీరుల సంస్మరణ సభ..

తిరుపతి.... ప్రత్యక్ష సాక్షి .. మంచిర్యాల

సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఘనంగా అమరవీరుల సంస్మరణ సభ శుక్రవారం జరిగింది. ఈ సభను ఉద్దేశించి సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో ధనిక రాజ్యం పోవాలని, సమ సమాజ కోసం ప్రజలు ఉద్యమాలు చేయాలని రైతులు కార్మికులు కూలీలు అన్ని వర్గాల ప్రజలు ఉద్యమంలో పాల్గొనాలని అప్పుడు సుదీర్ఘ పోరాటాలు చేస్తే తప్ప ఈ యొక్క సమాజం మారదని దోపిడీ పాలన వాలంటే ప్రజలందరూ ఏకతాటిపై రావాలని పోరాటాలు చేస్తే పోయేది సమాజం అప్పుడు మారుతుంది అన్నారు. పోరాడితే పోయేది బానిస సంకెళ్లు తప్ప హక్కులు సాధించవచ్చు కదా అని కొనియాడారు. ఎర్రజెండా నాయకత్వంలో పోరాటం చేసి హక్కులు సాధించు కోవాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా సిపిఐ సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ మంచిర్యాల జిల్లా కార్యదర్శి. అజ్మీర్ లాల్ కుమార్ మరియు అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ఉ



పాధ్యక్షులు దండ ప్రభాకర్, ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్,పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, అధ్యక్షుడు చరణ్, అరుణోదయ కళాకారులు మల్లన్న, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.



అనేక వ్యాధులను తగ్గించే ఈ మొక్క..

మన ఇంటి చుట్టూనే పెరుగుతుంది.. కనిపిస్తే వదలకండి..


మన వంట ఇంటి పోపు దినుసుల్లో వాము కూడా ఒకటి. ఇది ఎంతో సువాసనను కలిగి ఉంటుంది. దీన్ని కూరల్లో వేస్తే మంచి రుచి, వాసన వస్తాయి. అయితే కేవలం వాము గింజలు మాత్రమే కాదు, మనకు వాము ఆకులు కూడా లభిస్తాయి. ఈ మొక్క చాలా మంది ఇళ్లలో పెరుగుతూనే ఉంటుంది. కానీ దీన్ని వాము ఆకు మొక్క అనిఎవరూ గుర్తు పట్టి ఉండరు. ఈ మొక్క ఆకులను కూడా మనం పలు వ్యాధులను తగ్గించేందుకు ఉపయోగించవచ్చు. వాము ఆకుల్లో అద్భుతమైన ఔషధగుణాలు ఉంటాయనిఆయుర్వేదం చెబుతోంది. దీంతో అనేకలాభాలు పొందవచ్చనివైద్యులు అంటున్నారు.

జీర్ణ సమస్యలకు..: వాము ఆకులను నేరుగా అలాగే నమిలి తినవచ్చు. దీంతో పొట్టలో ఉండే అసౌకర్యం తగ్గుతుంది. కడుపు నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. వాము ఆకుల్లో థైమోల్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది జీర్ణాశయ ఎంజైమ్‌లు, జీర్ణ రసాలు సరిగ్గా ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీని వల్ల జీర్ణక్రియ మెరుగు పడుతుంది. తిన్న ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. అజీర్తి తగ్గుతుంది. కడుపు ఉబ్బరం నుంచి ఉపశమనం లభిస్తుంది. వాము ఆకులను తినడం వల్ల ఆకలి నియంత్రణలో ఉంటుంది. కొందరు ఆహారం అతిగా తింటారు. దీంతో బరువు పెరుగుతారు. అయితే ఈ సమస్య నుంచి బయట పడాలంటే వాము ఆకులను రోజూ నమిలి తింటుండాలి. దీంతో ఆకలి నియంత్రణలో ఉంటుంది. ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. వాము ఆకులను నమలడం వల్ల అతిగా తినడం అనే సమస్య తగ్గుతుంది. బరువును నియంత్రణలో ఉంచుకోవచ్చు. బరువు తగ్గాలనుకునే వారు ఈ ఆకులను తింటుంటే ఫలితం ఉంటుంది.

శ్వాసకోశ సమస్యలకు..: వాము ఆకులు దగ్గు, జలుబు, ముక్కు దిబ్బడ నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. గొంతు, ఊపిరితిత్తులలో ఉండే కఫాన్ని కరిగిస్తాయి. దీంతో ఊపిరితిత్తులకు గాలి సరిగ్గా లభిస్తుంది. శ్వాసనాశాలు క్లియర్ అవుతాయి. శ్వాసకోశ సమస్యల నుంచి బయట పడవచ్చు.గొంతులో గరగర,నొప్పి, మంట ఉన్నవారు వాము ఆకులను నీటిలో వేసి మరిగించి తాగుతుంటే ఫలితం ఉంటుంది. ఆస్తమా ఉన్నవారు ఈ నీళ్లను తాగుతుంటే సత్వరమే ఉపశమనం లభిస్తుంది. వాము ఆకుల్లో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు ఉంటాయి. కనుక ఈ ఆకులను నోట్లో వేసుకుని నమిలి తింటుంటేనోట్లోని బ్యాక్టీరియా నశిస్తుంది.దీంతోనోటి దుర్వాసన తగ్గుతుంది. దంతాలు, చిగుళ్లు దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. నోటి సమస్యలు కూడా తగ్గుతాయి. నోట్లోని పుండ్లు నయమవుతాయి.

ఆర్థరైటిస్ నొప్పులకు..: వాయు ఆకుల్లో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి నొప్పులు, వాపులను తగ్గిస్తాయి. దీని వల్ల ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. వాము ఆకులను మొటిమలను తగ్గించేందుకు కూడా ఉపయోగించవచ్చు. ఈ ఆకులను మెత్తని పేస్టులా చేసి ముఖానికి రాస్తుంటే ముఖంపై ఉండే మొటిమలు, ముడతలు, మచ్చలు పోతాయి. ముఖం కాంతివంతంగా మారి మెరుస్తుంది. యవ్వనంగా కనిపిస్తారు. శిరోజాల సంరక్షణకు కూడా ఈ ఆకులను ఉపయోగించవచ్చు. ఈ ఆకుల్లో ఉండే యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు శిరోజాలను సంరక్షిస్తాయి. చుండ్రు, దురద వంటి సమస్యలను తగ్గిస్తాయి. జుట్టు ఒత్తుగా, దృఢంగాపెరిగేలా చేస్తాయి.వాము ఆకుల్లోయాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. దీంతో బ్యాక్టీరియా, వైరస్ ఇన్ఫెక్షన్ల నుంచి సురక్షితంగా ఉండవచ్చు. ఇలా వాము ఆకులను తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

మంచినిద్రతో మేధాశక్తి



రాత్రిళ్లు తొందరగా, ఎక్కువసేపు పడుకొంటే టీనేజీ వయసువాళ్ల మెదడు పదునెక్కుతుందట. కేంబ్రిడ్జి యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు ఈ విషయాన్ని కనుక్కొన్నారు. త్వరగా పడుకొని, ఎక్కువసేపు నిద్రించిన వాళ్లతో పోలిస్తే మిగిలిన వాళ్లు.. లెక్కలు చేయడం, పదజాలం, చదవడం లాంటి మేధాశక్తికి సంబంధించిన పరీక్షల్లో చాలా వెనకబడ్డారని ఈ పరిశోధనలో తేలింది. "నిద్రించే సమయంలో మనం జ్ఞాపకాలను సంఘటితం చేసుకుంటాం కాబట్టి, నిద్ర మన మెదడు సామర్థ్యాన్ని పెంచుతుంది" అని ఈ అధ్యయన బృంద నాయకుడు బార్బరా సహాకియాన్ వెల్లడించారు. కాబట్టి, పిల్లల నిద్రించే వేళలు, నిద్రలో నాణ్యత విషయంలో పెద్దలు తగినంత శ్రద్ధ తీసుకోవాలి. అప్పుడే వాళ్లు జీవితంలో రాణిస్తారు.

మీ ఇంటి చుట్టు పక్కల మర్రి చెట్టు ఉందా..

అందులోని ప్రతి భాగమూ ఉపయోగకరమే..!

పూర్వ కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా ఏదో ఒక భారీ వృక్షం కనిపిస్తూనే ఉండేది. ముఖ్యంగా మర్రి చెట్లు మనకు ఎక్కువగా కనిపించేవి. కానీ ఇప్పుడు వాటి సంఖ్య బాగా తగ్గిపోయింది. చూద్దామంటే అసలు ఈ చెట్లు కనిపించడం లేదు. అయితే మర్రి చెట్టు మనక నీడను మాత్రమే కాదు, ఆరోగ్యాన్ని కూడా అందిస్తుంది. ఆయుర్వేదంలో మర్రి చెట్టుకు ఎంతో ప్రాధాన్యతను కల్పించారు. మర్రి చెట్టుకు చెందిన అన్ని భాగాలు మనకు ఏదో ఒక విధంగా ఉపయోగపడతాయి. మర్రి మెరడు, ఆకులు, వేళ్లు, ఊడలు అన్నీ మనకు ఉపయోగపడేవే. ఈ క్రమంలోనే ఆయా భాగాలతో అనేక వ్యాధులను నయం చేసుకోవచ్చని ఆయుర్వేదం చెబుతోంది.



డయాబెటిస్ అదుపులో..: మర్రి చెట్టు ఆకులు, బెరడులో యాస్ట్రింజెంట్ గుణాలు ఉంటాయి. అందువల్ల ఈ ఆకులు లేదా బెరడును నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను తాగుతుంటే జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. జీర్ణాశయం, పేగుల్లో ఉండే వాపులు తగ్గిపోతాయి. మర్రి చెట్టు ఆకులను ఉపయోగించడం వల్ల పేగుల్లో మలం సులభంగా కదులుతుంది. మలబద్దకం తగ్గుతుంది. పొట్టలో అసౌకర్యంగా ఉన్నవారు కూడా మర్రి చెట్టు ఆకులను తీసుకుని వాటితో కషాయం తయారు చేసి తాగుతుంటే ఎంతగానో ఉపశమనం లభిస్తుంది. షుగర్ ఉన్నవారికి మర్రి చెట్టును వరంగా చెప్పవచ్చు. మర్రి చెట్టు బెరడు ఇందుకు చక్కగా పనిచేస్తుంది. దీంట్లో హైపోగ్లైసీమిక్ గుణాలు ఉంటాయి. అంటే ఇది షుగర్ లెవల్స్‌ను గణనీయంగా తగ్గిస్తుందన్నమాట. మర్రి బెరడును నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను సేవిస్తుంటే డయాబెటిస్ తగ్గుతుంది. మర్రి బెరడులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీరం ఉత్పత్తి చేసే ఇన్సులిన్‌ను కణాలు సరిగ్గా శోషించుకునేందుకు పనిచేస్తాయి. దీంతో షుగర్ లెవల్స్ తగ్గి డయాబెటిస్ అదుపులో ఉంటుంది.

దంతాలు, నోరు, చిగుళ్ల సమస్యలకు..: మర్రి చెట్టు ఆకులను నేరుగా అలాగే నమిలి కాసేపు అయ్యాక ఉమ్మేయాలి. ఇలా చేస్తుంటే నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. దీంతో నోటి దుర్వాసన తగ్గిపోతుంది. ముఖ్యంగా పుచ్చిపోయిన దంతాలు ఉన్నవారు, చిగుళ్ల నుంచి రక్తం కారుతున్న వారు ఈ చిట్కాను పాటిస్తే ఫలితం ఉంటుంది. నోట్లో ఉండే పొక్కులు, పుండ్లను తగ్గించడంలోనూ మర్రి ఆకులు, బెరడు ఎంతగానోఉపయోగపడతాయి.మర్రి బెరడులోయాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. మర్రి బెరడును కాస్త పొడి చేసి అందులో కొద్దిగా నీళ్లను పోసి మెత్తని పేస్ట్‌లా తయారు చేయాలి. ఈ మిశ్రమాన్ని రాత్రి పూట ఆర్థరైటిస్ నొప్పులు ఉన్న చోట రాయాలి. ఇలా రోజూ చేస్తుంటే కొన్ని రోజులకు ఆర్థరైటిస్ నుంచి విముక్తి లభిస్తుంది. అలాగే శరీరంలో ఇతర చోట్లలో ఉండే నొప్పులు కూడా తగ్గిపోతాయి.

చర్మ సమస్యలకు..: మర్రి ఆకుల్లో యాంటీ మైక్రోబియల్, యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు అధికంగా ఉంటాయి. అందువల్ల ఈ ఆకులు అనేక చర్మ సమస్యలను తగ్గిస్తాయి. ముఖ్యంగా తామర, గజ్జి, ఇతర చర్మ ఇన్ఫెక్షన్లు తగ్గుతాయి. మర్రి ఆకుల పేస్ట్ లేదా బెరడు పొడి, నీటి మిశ్రమాన్ని రాస్తుంటే గాయాలు, పుండ్లు త్వరగా మానిపోతాయి. సూర్య కాంతి వల్ల చర్మం కందిపోయినా కూడా మర్రి ఆకుల మిశ్రమాన్ని ఉపయోగించవచ్చు. అలాగే మర్రి ఆకుల పేస్ట్‌లో కొద్దిగా చల్లని పాలను కలిపి ఈ మిశ్రమాన్ని రాస్తుంటే మొటిమలు, చర్మంపై ఉండే దురదలు,దద్దుర్లు తగ్గిపోతాయి. ఇలా మర్రి చెట్టు అనేక విధాలుగా ఉపయోగపడుతుంది. దీని లాభాలను అసలు మరిచిపోకండి.


కొంచెం శ్రమకే ఆయాసమా?

కొన్ని మెట్లు ఎక్కగానే ఊపిరి సరిగ్గా ఆడటం లేదా? ఆయాసంగా అనిపిస్తున్నదా? ఏ కొంచెం శారీరక శ్రమ చేసినా ఊపిరి సరిపోవడం లేదంటే దాన్ని తేలిగ్గా తీసుకోకూడదు. వయసు పెరగడం, అలసట వల్ల ఇలా జరుగుతుంది. దీన్ని అయిదు ప్రధాన ఆరోగ్య సమస్యలకు హెచ్చరికగా భావించాలి. ఏదైనా అనుమానం అనిపిస్తే వెంటనే వైద్య సహాయం పొందాలి. తగిన చికిత్స తీసుకోవాలి.

రక్తహీనత: శరీరం తగిన మోతాదులో ఎర్ర రక్త కణాలు లేదా హిమోగ్లోబిన్‌ను ఉత్పత్తి చేయకపోతే రక్తహీనత (ఎనీమియా) వస్తుంది. హిమోగ్లోబిన్ మనం పీల్చిన గాలి నుంచి ఆక్సిజన్ గ్రహించి శరీర అవయవాలకు సరఫరా చేస్తుంది. హిమోగ్లోబిన్ తగ్గితే శరీర కణజాలానికి ఆక్సిజన్ తగినంతగా అందదు. దీంతో శ్వాసించే క్రమం తగ్గిపోతుంది. ముఖ్యంగా శారీరక శ్రమ చేస్తున్నప్పుడు ఇలా జరుగుతుంది. కాబట్టి, చర్మం పచ్చబడటం, బలహీనత, అలసట మొదలైన వాటితో బాధపడుతుంటే అది రక్తహీనత లక్షణం కావచ్చు.

గుండెజబ్బులు: చిన్న ప్రయత్నానికే ఊపిరి సరిగ్గా ఆడటం లేదంటే అది గుండెజబ్బుకు సంకేతం కావచ్చు. వయసు పెరిగేకొద్ది గుండె రక్తాన్ని పంప్ చేసే శక్తి తగ్గుతూ వస్తుంది. దీంతో ఊపిరితిత్తుల్లో ఫ్లూయిడ్ పేరుకుంటుంది. మెట్లెక్కేటప్పుడు మీకు కండ్లు తిరగడం (డిజినెస్), కాళ్లవాపు, ఛాతినొప్పి లాంటి సమస్యలు వేధిస్తుంటే డాక్టర్‌ను కలవాలి. ఇది గుండె సమస్యలకు సంకేతం అయ్యుంటుంది.

ఊపిరితిత్తుల సమస్యలు: మన శరీరానికి కావాల్సిన ఆక్సిజన్‌ను సరఫరా చేయడమే ఊపిరితిత్తుల పని. శ్వాసించడం కష్టమైపోతున్నదంటే అది ఊపిరితిత్తుల సమస్య కావచ్చు. ఆస్తమా, బ్రాంకైటిస్, ఇంటర్‌స్టీషియల్ లంగ్ డిసీజ్ (ఐఎల్‌డీ), క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (సీఓపీడీ) లాంటివి ఊపిరితిత్తుల పనితీరును దెబ్బతీస్తాయి. ఫలితంగా ఏ కొంచెం శ్రమపడ్డా శ్వాసలో ఆటంకం (డిస్పోయియా) కలుగుతుంది. దగ్గు, శ్వాస గుర్‌గుర్‌మని రావడం (వీజింగ్), ఛాతీలో అసౌకర్యంగా అనిపిస్తుంటే జాగ్రత్తగా ఉండాలి.




ఒత్తిడి- ఆందోళన: ఒత్తిడి, ఆందోళన కారణంగా కూడా ఊపిరి సరిగ్గా ఆడదు. అధిక ఒత్తిడి వల్ల శరీరం అడ్రినలిన్ హార్మోన్‌ను ఎక్కువగా విడుదల చేస్తుంది. ఇది శ్వాసించే క్రమాన్ని పెంచుతుంది. దీంతో సరిగ్గా శ్వాస పీల్చుకోవడం లేదనే భ్రమలో పడిపోతారు.

అధిక బరువు వల్ల: అధిక బరువు ఉంటే శరీరం తన సాధారణ విధులను నిర్వర్తించడానికి మరింత ప్రయత్నం చేయాల్సి వస్తుంది. అధిక కొవ్వు వల్ల డయాఫ్రమ్, ఊపిరితిత్తుల మీద ఒత్తిడి పడుతుంది. ఇది ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. దీంతో ఏ కొంచెం శారీరక శ్రమ చేసినా శ్వాస సరిపోని పరిస్థితి తలెత్తుతుంది.

ఆహారంలో ఇవి చేర్చుకోండి.. మంచి నిద్రపోండి..

కొంతమందికి రాత్రుళ్లు సరిగ్గా నిద్ర పట్టదు. అనారోగ్య సమస్యలున్న వారు డాక్టరు చెప్పిన పద్ధతులు పాటిస్తారు. అయితే ఆరోగ్యంగా ఉన్న వాళ్లు కూడా ఈ సమస్యతో బాధపడుతుంటారు. అటువంటి వారు ఆహారంలో కొన్ని మార్పులు చేసుకుంటే మంచి నిద్రని పొందవచ్చు. ఆర్థికంగా భారమైనా వీటిని చేర్చుకుంటే ఫలితం ఉంటుంది. పాలకూరలో మెగ్నీషియంతో పాటు ఐరన్, కాల్షియం పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలు ఒత్తిడిని తగ్గించి మనసును ప్రశాంతం చేయడంలో సహాయపడతాయి. అందుకే రోజూ పాలకూర తినడం మంచి నిద్రకు దారి తీస్తుంది. పాలకూర వల్ల రక్త ప్రసరణ మెరుగుపడి శరీరం స్థిరంగా ఉంటుంది. బాదం గింజల్లో పోషకాలు చాలా ఉంటాయి. వీటిలో మెగ్నీషియం ఎక్కువగా ఉండటం వల్ల శరీరానికి కావాల్సిన మినరల్స్ అందుతాయి. రోజూ కొద్దిగా బాదం గింజలు తినడం వల్ల మెదడు కూడా చురుగ్గా మారుతుంది. అంతేకాకుండా ఇందులో ఉన్న ఆరోగ్యకరమైన కొవ్వులు మంచి నిద్రకు సహాయపడతాయి. అందుకే నిద్ర సమస్యలు ఉన్నవారు బాదం తినడం అలవాటు చేసుకోవాలి. అవకాడో పండులో కూడా మెగ్నీషియం ఎక్కువగా ఉంటుంది. ఇది ఆరోగ్యకరమైన కొవ్వులు, పొటాషియంతో నిండి ఉంటుంది. అవకాడో తినడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గి శరీరంలోని రసాయనాలు సరిగ్గా పనిచేస్తాయి. ఫలితంగా మంచి నిద్ర వచ్చే అవకాశం ఉంటుంది. గుమ్మడి గింజలు శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిలో మెగ్నీషియం, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. వీటిని రోజూ ఆహారంలో చేర్చుకోవడం వల్ల కండరాలు రిలాక్స్ అవుతాయి. మానసిక ఒత్తిడి తగ్గి నిద్ర మెరుగుపడుతుంది. గుమ్మడి గింజలు నిద్ర సమస్యలకు ఒక సహజమైన పరిష్కారం. క్వినోవా మెగ్నీషియం, ప్రోటీన్, ఫైబర్ అధికంగా కలిగిన ఆహారం. ఇవి తినడం వల్ల శరీరంలో



చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. మంచి నిద్రకు కూడా సహాయపడుతుంది. ఇది శరీరశక్తిని పెంచడంలో కూడా మేలు చేస్తుంది. బ్లాక్ బీన్స్‌లో కూడా మెగ్నీషియం, ప్రోటీన్, ఫైబర్ మంచి మోతాదులో ఉంటాయి. ఈ బీన్స్‌ను సలాడ్, సూప్,కూరలలో వేసితినడం వల్ల శరీరానికి కావాల్సిన పోషకాలు అందుతాయి. ఇవి ఒత్తిడిని తగ్గించి శరీరాన్ని ప్రశాంతంగా ఉంచి నిద్రకు సహాయపడతాయి. అరటి పండులో కూడా మెగ్నీషియం ఉంటుంది. ఇందులో పొటాషియం అధికంగా ఉండటం వల్ల కండరాలను రిలాక్స్ చేసి శరీర ఒత్తిడిని తగ్గిస్తుంది. దాంతో మానసిక ప్రశాంతత కలుగుతుంది. నిద్ర మరింత హాయిగా వస్తుంది. సాల్మన్ చేపల్లో మెగ్నీషియం, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి ఒత్తిడిని తగ్గించి నిద్ర నాణ్యతను పెంచడంలో సహాయపడతాయి. ఈ చేపలు తినడం వల్ల శరీరం, మనస్సు రెండూ బాగా విశ్రాంతి పొందుతాయి. ఈ విధంగా మెగ్నీషియం ఉన్న ఆహారాలు మంచి నిద్రను అందించి ఆరోగ్యానికి తోడ్పడతాయి.

లెట్స్ పిల్లో టాక్!

ప్రస్తుతం భార్యాభర్త.. ఇద్దరూ ఉద్యోగాలు చేయాల్సిన పరిస్థితులు. ఓవైపు ఆఫీస్.. ఇంటి పనులంటూ ఉరుకులు పరుగులు. మరోవైపు పిల్లలు, వారి చదువులు. పెద్దవాళ్ల బాధ్యతలు! వెరసి.. క్షణం తీరికలేని జీవితాలు! దంపతులకు కాస్తంత సమయం దొరకడం కూడా గగనమే అవుతున్నది.ఒకవేళ దొరికినా.. ఇద్దరూ ఏకాంతంగా గడపడం కూడా కష్టంగా మారుతున్నది. ఫలితంగా..భార్యాభర్తల మధ్యదూరం పెరుగుతున్నది. ఈ సమస్యకు 'పిల్లో టాక్' ఓ పరిష్కారం చూపుతున్నది.

దంపతులు ఎంత సన్నిహితంగా ఉంటే.. వారి మధ్య బంధం అంత బలంగా ఉంటుంది. మనసు విప్పి మాట్లాడుకుంటేనే.. సాన్నిహిత్యం పెరుగుతుంది. కానీ, ఈ ఉరుకుల పరుగుల జీవితంలో చాలామందికి అలాంటి సమయం దొరకడం లేదు. దొరికినా.. కొంతమంది తమ భాగస్వామితో అన్ని విషయాల్నీ స్వేచ్ఛగా చెప్పుకోలేకపోతున్నారట. తమ ఇష్టాయిష్టాలు, భవిష్యత్తు లక్ష్యాల గురించి పంచుకోవడానికీ ఆసక్తి చూపించడం లేదట. చెబితే భాగస్వామి ఎలా రియాక్ట్ అవుతారో.. తమ ఇష్టాయిష్టాలు, లక్ష్యాలను గౌరవిస్తారో లేదోనన్న సందిగ్ధమే ఇందుకు కారణమని నిపుణులు అంటున్నారు. ఇలాంటి వాళ్లు 'పిల్లో టాక్'తో ఒక్కటవ్వొచ్చని చెబుతున్నారు.



మనసులు దగ్గర..: రాత్రిపూట పడకగదిలో భార్యాభర్తలు ఇద్దరూ ఏకాంతంగా, మనసు విప్పి మాట్లాడుకోవడమే.. పిల్లో టాక్! దీనివల్ల భార్యాభర్తల శరీరాల్లో 'ఆక్సిటోసిన్' అనే ప్రేమ హార్మోన్ విడుదలవుతుంది. ఇది మానసిక సమస్యలను దూరం చేస్తుంది. మనసుకు ప్రశాంతత చేకూరుస్తుంది. దంపతుల మధ్య దూరం తగ్గడంతోపాటు ఒకరినొకరు అర్థం చేసుకునే సమయం చిక్కుతుంది. భాగస్వామి మనసులో కోరికలు తెలుసుకోవడంతోపాటు వాటిని నెరవేర్చడానికీ అవకాశం ఉంటుంది. అందుకే.. భార్యాభర్తలు రోజంతా ఎంత బిజీగా ఉన్నా.. రాత్రిపూట కనీసం ఓ అరగంటైనా మనసు విప్పి, ఏకాంతంగా మాట్లాడుకోవాలని మానసిక నిపుణులు సూచిస్తున్నారు.

ఇవి వద్దే వద్దు..: అయితే, చాలామంది 'పిల్లో టాక్'లో లేనిపోని సమస్యలను ముందేసుకుంటారు. దొరక్కదొరక్క దొరికిన సమయాన్ని దుర్వినియోగం చేసుకుంటారు. ఎప్పుడో జరిగిన గొడవలు, ఆఫీస్ సమస్యలు, పిల్లల చదువులు, పెద్దల ఆరోగ్యానికి సంబంధించిన విషయాలను చర్చిస్తుంటారు. ఇలాంటి చర్చలవల్ల సరదాగా సాగాల్సిన సమయం.. వృథాగా గడిచిపోతుంది.

ఒక్కోసారి పాతగొడవలు ముందుకొచ్చి.. దంపతుల మధ్య దూరం పెరిగే ప్రమాదమూ ఉంటుంది. వాటికి బదులుగా పెళ్లినాటి జ్ఞాపకాలు, హనీమూన్ మధురానుభూతులు, ఇచ్చిపుచ్చుకున్న కానుకలు, ఇద్దరి మధ్య జరిగిన సరదా సంఘటనలు.. ఇలాంటివి గుర్తుకు తెచ్చుకుంటే మంచిది. ఇలాంటి సంభాషణలతో ఇద్దరి మధ్య అనుబంధం మరింత దృఢంగా మారుతుంది.

మేడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా చెకుముకి గోడ పత్రిక ఆవిష్కరణ..



డి సుధాకర్ ప్రత్యక్ష సాక్షి మెట్‌పల్లి టౌన్

జగిత్యాలజిల్లా మెట్‌పల్లి మండలం మేడిపల్లి గ్రామంలో విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన పరిశో ధనాత్మక దృక్పథం పెంపొందించే లక్ష్యంతో మెట్‌పల్లి మండలం మేడిపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో చెకుముకి గోడ పత్రికను ఘనంగా ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థుల్లో విజ్ఞానంపై ఆసక్తిని పెంచడంలో శాస్త్రీయ విషయాలను సులభంగా అర్థం చేసుకోవడంలో చెకుముకి గోడ పత్రిక ఎంతో దోహదపడుతుందని తెలిపారు గోడ పత్రికలోని అంశాలను విద్యార్థులు ఆసక్తిగా చదివి, శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు చెకుముకి ప్రాముఖ్యత ఉపయోగం గురించి విద్యార్థులకు వివరించి వారిలో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నాగమణి ఉపాధ్యాయులు పుప్పాల నాగన్న భీమన్నహొహొసొప్పరి శ్రీనివాస్ లక్ష్మీబాయి విద్యార్థులు పాల్గొన్నారు.

టపాకాయల దుకాణాలకు పోలీస్ అనుమతి తప్పనిసరి : సీపీ వెల్లడి

యాదవరావు ప్రత్యక్ష సాక్షి పోతంగల్



నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా దీపావళి పండుగ సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తాత్కాలిక టపాకాయల దుకాణాలు నెలకొల్పే వారు తప్పనిసరిగా సంబంధిత డివిజినల్ స్థాయి పోలీస్ అధికారుల అనుమతి తీసుకోవాలని పోలీస్ కమిషనర్ తెలిపారు.దుకాణాలు పెట్టే వారు తమ సంబంధిత డివిజినల్ పోలీస్ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకొని అనుమతి పొందాలని సూచించారు. ఇతర సమాచారం కోసం సంబంధిత డివిజినల్ అధికారిని సంప్రదించాలన్నారు.

అనుమతి లేకుండా టపాకాయల దుకాణాలు నెలకొల్పినట్లయితే వారిపై ఎక్స్‌ప్లోజివ్ యాక్ట్ - 1884 రూల్స్ 1933 సవరణ 2008 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.టపాకాయల దుకాణదారులు తప్పక పాటించాల్సిన నిబంధనలు టపాకాయల దుకాణాలు సంబంధిత ఖాళీ ప్రదేశాలలోనే నెలకొల్పాలి. ఖాళీ ప్రదేశానికి సంబంధించిన ఎన్.ఓ.సి సర్టిఫికేట్ పొందాలి. ఒక క్లస్టర్‌లో 50 షాపులకు మించరాదు. జనరద్దీ గల ప్రదేశాలలో ఎలాంటి టపాకాయల షాపులు ఏర్పాటు చేయరాదు. అదేవిధంగా కళ్యాణ మండపాలు, సమావేశ కేంద్రాలలో టపాకాయల దుకాణాలు నెలకొల్పరాదు. తాత్కాలిక టపాకాయల దుకాణాలలో ఫైర్ కు సంబంధించిన జాగ్రత్తలు తప్పక పాటించే విధంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

మంథని విద్యార్థి యువత సంస్థాగత 2000 శుభ శ్రేష్ఠోత్సవంను విజయవంతం చేయాలి

టి.సత్యనారాయణ గౌడ్ ప్రత్యక్ష సాక్షి మంథని రూరల్



స్వచ్ఛంద స్ఫూర్తి కార్యక్రమాల నిర్వహక సంస్థ మంథని విద్యార్థి యువత సంస్థాగత 2000 శుభ శ్రేష్ఠోత్సవం ను విజయవంతం చేయాలని వ్యవస్థాపక అధ్యక్షులు కొండేల మారుతి కోరారు. పెద్దపల్లి జిల్లా మంథని ముక్క వీర రాఘవులు నగర్లో గల కార్యలయంలో సమాలోచన సన్నహాక సమావేశం శుక్రవారం చంద్రుపట్ల సుధాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది.. మంథని ఉపాధ్యాయ బృందం లావణ్య, ఉషా, మంజుల, రిటైర్డ్ టీచర్స్ మారుతి, బుచ్చన్న గౌడ్, లు సునీ నేతృత్వం లో శుభారంభ సూచిక గా జోతి ప్రజ్వలన చేసారు.. సామాజిక పరం గా విద్య, వైద్య సాహితీ, సాంస్కృతిక, సాంఘీక కోణంలో మద్యపానం మానండి, చెట్ల పెంపకం, రక్తదానశిభిరాలు, ప్లాస్టిక్ కనుమరుగు, వినియోగదారుల కు అవగాహనా తరగతులు, గ్రంధాలయ నిర్వహణ లాంటి

25 అంశాల వ్యవహార సరళీకృత విభిన్న ప్రక్రియ లను నిర్వహించామని కొండేల మారుతి విశదీకరించారు.. రానున్న మాసము లో తలపెట్టిన రెండు వేయిల కార్యక్రమం లో వివిధ రంగాల నిష్ణాతులు పాల్గోనేలా కార్యాచరణ సిద్దమైందనీ త్వరలో మంథని ప్రాదేశిక ప్రవాసీయులతో తమ ప్రతినిధి బృందం ప్రాతినిద్యం రూపేణా కలువనున్నట్టు మారుతి వెల్లడించారు.. కార్యక్రమ నిర్వహక ప్రతినిధులు రామడుగు మారుతీ రావు, చంద్రుపట్ల సుధాకర్ రెడ్డి, తాటి బుచ్చన్న గౌడ్, నారమల్ల కృష్ణ, బోగోజు శ్రీనివాస్ ప్రబృతుల తో బృందం ఏర్పాటైందీ.. అనంతరం ఈ సందర్భంగా మంథని విద్యా రంగానికి ఎన లేని కృషి చేస్తున్న మేరీ మీడియా స్కూల్ ఎచ్. ఎం.సునీ సిస్టర్ ను ఘనంగా సత్కరించారు

సీజనల్ వ్యాధుల నివారణ కోసం కాలనీలో పర్యటించిన వర ప్రదీప్

ప్రత్యక్ష సాక్షి , సుల్తానాబాద్




సుల్తానాబాద్ పట్టణంలో నీ ఏడవ వార్డులో కౌన్సిలర్ ఉట్ల వరప్రదీప్ శుక్రవారం కాలనీలో పర్యటించి ప్రజలకు సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు, మున్సిపల్ కార్మికులతో కాల్వలను శుభ్రం చేయించారు, దోమల నివారణకు డ్రంబుల్లో నీళ్లు నిలువ ఉంచకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు,గృహవాసులు తప్పనిసరిగా పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలని వర ప్రదీప్ కాలనీ వాసులకు తెలిపారు..

ఘనంగా వివేకవర్ధని విద్యార్థుల ఫ్రెషర్స్ డే పార్టీ ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



పల్లె సమ్మయ్య ప్రత్యక్ష సాక్షి మందమర్రి

మందమర్రి పట్టణం శ్రీ కన్వెన్షన్ హాల్లో వివేకవర్ధని డిగ్రీ కళాశాల ఇంటర్ విద్యార్థుల ప్రెస్సర్స్ డే పార్టీ శుక్రవారం శ్రీ కన్వెన్షన్ హాల్లో ఘనంగా జరిగింది. కళాశాల కరస్పాండెంట్ ఊదరి చంద్రమోహన్ మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని విద్యార్థులు పట్టుదలతో చదివి తల్లిదండ్రులు పెట్టుకున్న కళలను సహకారం చేయాలని అదే విధంగా ఉత్తమ ఫలితాలు సాధించి కళాశాల పేరు నిలబెట్టాలని కరస్పాండెంట్ తెలిపారు. కార్పొరేటు కళాశాలలకు దీటుగా మంచి సౌకర్యాలతో మెరుగైన విద్యా బోధన అందించడంలో తమ లెక్చరర్లు ముందున్నారని మంచిర్యాల జిల్లాకు చెందిన అనేకమంది విద్యార్థులు వరంగల్ హైదరాబాద్ ఆంధ్ర ప్రదేశ్ లోని రాజమండ్రి లాంటి ప్రాంతాలకు తరలివెళ్లి లక్షల ఫీజులు చెల్లించి చదువుతున్నారని కార్పొరేట్ కళాశాలలకు దీటుగా జిల్లాలోని మంచి సౌకర్యాలతో మెరుగైన విద్యను విద్యాబోధనను అందిస్తున్న తమను ఆదరించాలని కస్పాండెంట్ తెలిపారు. దూరపు కొండలు నునుపు అనే విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలి అని అక్కడికి వెళ్లి లక్షల ఫీజులు చెల్లించి ఆర్థికంగా నష్టపోవడం తప్ప పెద్దగా ప్రయోజనం ఏమి ఉండదని గత కొన్ని సంవత్సరాలుగా జిల్లాలో మంచి ఫలితాలు సాధించడంలో తమ కళాశాల ముందుందని దీనికి లెక్చరర్లు విద్యార్థుల కృషి వళ్లే సాధ్యమైందన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయిని ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకుబహుమతులు అందజేశారు.



చెక్ బౌన్స్ కేసునిందితుడికి రిమాండ్.. మెట్‌పల్లి ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వినుకొండ మాధవి

డి సుధాకర్ ప్రత్యక్ష సాక్షి మెట్‌పల్లి టౌన్



జగిత్యాలజిల్లా మెట్‌పల్లిహొహొశుక్రవారం వివరాల వెల్లడించిన న్యాయవాది పసునూరి శ్రీనివాస్ చెక్ బౌన్స్ కేసులో కోర్టుకి సక్రమంగా హాజరు కానీ నిందితుడికి గురువారం రాత్రి మెట్‌పల్లి కోర్టు రిమాండ్ విధించిందిహొహొఫిర్యాదుదారు తరపు న్యాయవాది పసునూరి శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం మల్లాపూర్ మండలం హుస్సేన్ నగర్ గ్రామానికి చెందిన షేక్ అలీ మెట్‌పల్లి పట్టణానికి చెందిన గుంటుక ప్రసాద్ దగ్గర 2023 సంవత్సరంలో రూపాయలు 3, 50,000హొహొఅప్పుగా తీసుకున్నాడు తీసుకున్న రూపాయలకు ప్రామిసరి నోట్ తో పాటూ గ్యారంటీగా బ్యాంక్ చెక్కుని కూడా ఇచ్చాడు వాయిదా ప్రకారం అలీ తీసుకున్న డబ్బులు చెల్లించకపోవడంతో రుణం ఇచ్చిన వ్యక్తి, అట్టి చెక్కుని బ్యాంకులో వేయగాహొహొఖాతాలో డబ్బులు లేక చెక్కు వాపస్ వచ్చిందిహొహొదీంతో అప్పు తీసుకున్న వ్యక్తి షేక్ అలీ పై ఫిర్యాదుదారు గుంటుక ప్రసాద్ తేది: 20 జూన్ 2023 రోజున సమ్మరి ట్రయల్ కేసు వేయగా మెట్ పల్లి కోర్టుహొహొఎస్ టి సి ఇన్‌హొహొచీూ 41/2023 ద్వారా కేసు నమోదు చేసి నిందితుడికి సమన్లు పంపింది సమన్లు అందుకున్న షేక్ అలీ మొదట్లో కొన్ని సార్లు కోర్టు పేషికి హాజరు అయినప్పటికీహొహొఇటీవల కాలంగా కోర్టుకి సక్రమంగా హాజరు కాకపోవడంతో అతనిపై మెట్ పల్లి జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ తేది 20 జూలై 2026 రోజున ఎన్ బి డబ్ల్యుహొహొహొనాన్ బెయిలేబుల్ వారంట్‌హొహొజారీ చేసింది వారంట్ కాపీ అందుకున్న మల్లాపూర్ పోలీసులు తేది 05 నవంబర్ 2026 రోజున షేక్ అలీని అరెస్ట్ చేసి మెట్‌పల్లి కోర్టులో హాజరు పరచగాహొహొనిందితున్ని కరీంనగర్ జైలుకి రిమాండ్ విదిస్తూహొహొఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వినుకొండ మాధవి గురువారం రాత్రి 10 గంటలకు ఆదేశాలు జారీ చేయగాహొహొఅదేరాత్రి నిందుతున్ని మల్లాపూర్ పోలీసులు కరీంనగర్ జైలుకి తరలించారు.

కరవు కోరల్లో తెలంగాణ...

మాజీమంత్రి టి. జీవన్ రెడ్డి..



కుమారస్వామి ప్రత్యక్ష సాక్షి స్టాప్ రిపోర్టర్ జగిత్యాల

ప్రజాక్షేత్రంలో రైతన్న కన్నీళ్లు తుడవాల్సిన ప్రభుత్వ అలసత్వాన్ని ఎండగడుతూ బిఆర్ఎస్ నేతలు నిరసన గళం విప్పారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ తెలంగాణ భవన్ లో శుక్రవారం మాజీ మంత్రి, బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి తదితర ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.ఈ సందర్భంగా మాజీమంత్రి జీవన్ రెడ్డి మాట్లాడుతూ

ఎండిపోతున్న చేన్లను చూడండి.. రైతన్న కడుపు కోతను తీర్చండి.. కరువు కోరల్లో తెలంగాణ: రాష్ట్రం కరువుతో తల్లడిల్లుతోంది. విద్యాసంస్థలు మూసివేసి ఆన్‌లైన్ బోధనకు వెళ్లాల్సిన దయనీయ పరిస్థితి దాపురించింది. దేవుడిచ్చిన నీళ్లు, ప్రాజెక్టుల ద్వారా ఎత్తిపోసే అవకాశం ఉన్నా... లక్షల క్యూసెక్కుల నీరు సముద్రంపాలువుతుంటే చూస్తూ ఊరుకోవడం క్షమించరాని నేరం.

కేసీఆర్ దూరదృష్టి -- రేవంత్ మూర్ఖపు పట్టుదల: కరువు సమయంలోనూ సాగు, తాగునీరు అందించాలని కేసీఆర్ మూడేళ్లలోనే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మిస్తే... కేవలం కేసీఆర్‌కు ఎక్కడ పేరు వస్తుందోనన్న ఈగోతో, చిన్నపాటి మరమ్మతులకు మూడేళ్లు దాటుతున్నా రేవంత్ ప్రభుత్వం అడుగు ముందుకు వేయడం లేదు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యం కాదు... ఉద్దేశపూర్వక కుట్ర!

వంద కోట్లు ఖర్చు చేస్తే కరువు ఖతమ్: కన్నెపల్లి వద్ద రూ.100 కోట్లతో నెలకు ఒక కాపర్ డ్యాం నిర్మిస్తే... ఐదు నెలల్లో 150 టీఎంసీల నీటిని వాడుకోవచ్చు. అన్నారం, సుందిళ్లల్లో నాణ్యత సమస్యల్లేవని ఎన్ డి ఎస్ ఏ నివేదికలు స్పష్టం చేస్తున్నా నీటిని ఎత్తిపోయకపోవడం హాస్యాస్పదం. సీతారామ ప్రాజెక్టుకు ఒక న్యాయం... కాళేశ్వరానికి మరో న్యాయమా?

బోగస్ రైతు భరోసా -- తీవ్ర వంచన: 'రైతు భరోసా జమైంది' అని మొబైల్ మెసేజ్‌లు చూసి సంబరంగా బ్యాంకులకు వెళ్తే... రేవంత్ రెడ్డి మార్క్ ఫేక్ మెసేజ్‌లని తేలి రైతన్నలు ఆశాభంగం చెందుతున్నారు. ఆరుతడి పంటలు వేయమనే ప్రభుత్వం, ఎకరానికి రూ.30 వేల దాకా ఖర్చయ్యే డ్రిప్ సౌకర్యాలకు, విత్తనాలకు రాయితీలు ఇవ్వకుండా చేతులెత్తేసింది.

కబ్జాలపై పోరు ఆగేది లేదు: జగిత్యాల ఎంఆర్ఓ భవనం కూల్చిన స్థలంలో పెట్రోల్ పంపు ఏర్పాటుతో కోట్ల విలువైన రెండు ఎకరాల ప్రభుత్వ భూమికి విలువ లేకుండా పోతోంది. వివాదాస్పద స్థలాన్ని నిషేధిత జాబితా నుంచి ఎలా తొలగిస్తారు? కలెక్టర్ గారూ... తక్షణమే స్పందించి సరిచేయండి. ప్రభుత్వ ఆస్తులను కాపాడే వరకు బిఆర్ఎస్ పార్టీ పోరాడుతూనే ఉంటుంది. ఈ సమావేశంలో నాయకులు మున్నా, నల్ల స్వామిరెడ్డి, వెంకటేశ్వరావు, దేవేందర్ నాయక్, శీలం ప్రవీణ్, గాజుల రాజేందర్, వివిధ హోదాల్లోని నాయకులు, ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

2 కోట్ల 25 లక్షల పనులు పూర్తి.. 40 లక్షలతో సిసి రోడ్ పనులు ప్రారంభం..

లక్ష్మణ్ ప్రత్యక్ష సాక్షి మంథని





మంథని పట్టణంలోని చిల్డ్రన్స్ పార్క్ నుండి ప్రారంభించిన రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పూర్తిగా పాటించాలని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ శ్రీరామ్ మాట్లాడుతూ చిన్నతనం నుండి మంచి ఇంట్లో చదువుకొని మంథనిలో పెరిగిన వాడినని రోడ్డు నిర్మాణ పనుల్లో పూర్తిగా నాణ్యత ప్రమాణాలు పాటించాలని లక్ష్యంతో పని చేశానన్నారు. రిటైర్డ్ ఇంజనీర్ సత్యనారాయణ మహావాది మాట్లాడుతూ రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మంథని పట్టణ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని తెలిపారు రోడ్డు నిర్మాణ పనుల్లో పూర్తి నాణ్యత ప్రమాణాలు పాటించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. కౌన్సిలర్ పెంటరి రాజు మాట్లాడుతూ రెండు కోట్ల 56 లక్షలతో డిపో ముందున్న గోదావరిఖని మెయిన్ రోడ్ నుండి చిల్డ్రన్స్ పార్క్ వరకు అలాగే రెడ్డి భవన్ నుండి ఎరుకల గూడెం మెయిన్ రోడ్డు వరకు 2 కోట్ల 25 లక్షలతో ఇరువైపులా డ్రైనేజీ సౌకర్యంతో పనులు పూర్తయ్యాయి అన్నారు. ప్రస్తుతం 40 లక్షలతో ప్రారంభమైన ఈ రోడ్డుకు అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ద్వారా ఛాంబర్ లతో రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతతో పూర్తి అవడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. రోడ్డు పనులను మున్సిపల్ ఏఈ మౌనిక పరిశీలించారు. రోడ్డు పనులు బేష్ గా ఉన్నాయి రోడ్డు నిర్మాణ పనుల్లో పూర్తిగా నాణ్యత పాటించారు. ఇంత త్వరగా పనులు పూర్తి చేసినందుకు కృతజ్ఞతలు.. రోడ్డు పనులలో నాణ్యత ప్రమాణాలు పూర్తిగా పాటించారు.. రిటైర్డ్ ఇంజనీర్ సత్యనారాయణ మహావాది

శ్రీధర్ బాబు పై విమర్శలు చేస్తే ఊరుకోం..

ఎంపీ వంశీకృష్ణ లేఖపై గడ్డం క్రాంతి రణదేవ్ ఆగ్రహం

మల్హర్, ప్రత్యక్ష సాక్షి



గణపతి సచ్చిదానంద స్వామీజీ మంథని పర్యటనపై ఎంపీ గడ్డం వంశీకృష్ణ రాసిన లేఖను మల్హర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు, చిన్నతూండ్ల సర్పంచ్ గడ్డం క్రాంతి రణదేవ్ తీవ్రంగా ఖండించారు. శుక్రవారం కొయ్యూరు లో యూత్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కాంగ్రెస్ పార్టీ కోసం ఎంతో కష్టపడ్డారని, ఆయనపై విమర్శలు చేయడం సరికాదన్నారు.ఆధ్యాత్మిక కార్యక్రమాలపై రాజకీయ విమర్శలు చేయడం తగదని, మంథని పర్యటనల్లో స్థానిక కాంగ్రెస్ నాయకులను కలుపుకొని వెళ్లాలని ఎంపీకి సూచించారు. ఎంపీ వ్యవహారశైలిపై కాంగ్రెస్ అధిష్ఠానానికి ఆధారాలతో ఫిర్యాదు చేస్తామని, మంత్రి శ్రీధర్‌బాబుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ సర్పంచులు బండి స్వామి, చంద్రగిరి సంపత్, బెల్లంకొండ జ్యోత్స్న సరీన్ రావు, మేకల రాజయ్య, అబ్బినవేణి ఓదెలు, బొమ్మ రజిత రమేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల రాహుల్, కిషన్ నాయక్, దుద్దిళ్ల సత్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

printed,published and owned by Kandukuri Parameshwar Rao, printed at Rimsha printers,. H .no 5-16/1, Algunoor,Mandal Thimmapur, Dist Karimnagar (TS) place of Publication H.NO.1-2-31/4/B/1 krishna nagar jagital dist(TS).cell no.99892 88546, Editor K.Parameshwar rao. RNI No.APTEL/2011/38267. kprao1961@gmail.com